# భైరవో పాఖ్యానం

"ఈ ప్రపంచమంతా మిథ్య" అని ఓ మూల కూచునే కొద్ది పాటి మందిని మినహాయిస్తే తతిమావాళ్ల కందరికీ తమతమ జీవితాల్లో అనంతాశయాలూ, వాటిని సాధించాలనే పట్టుదలా, విజయాన్ని గురించిన మధుర స్వప్నాలూ తప్పవు. చేసుకోబోయే భార్యగురించీ, పుట్టబోయే కొడుకు గురించీ – రాగల మహదైశ్వర్యాలగురించీ మానవుడి బుర్ర సతతమూ ఆలోచిస్తోనే వుంటుంది. ఎవడేనా సరే జీవితంలో కొన్ని డక్కామొక్కీలు తిని చివరికి తనకు లాభించగల దేమీలేదని రూఢి చేసుకున్నాక కూడా "నాది ఒట్టి దురదృష్ట జాతకం" అనుకోవటం – ఆశల్ని మరిచిపోలేక పోవటమే!

"మనుషులందరికీ ఒకటే రకం అభిరుచులూ కోరికలూ వుంటే ఆసలింతమంది బ్రతకటమే అనవసరం" అంటున్నాడు సత్యనారాయణ.

ఆయన చెబుతూన్నది ఎంతవరకు నిజమో నా కర్థం కాదు. ఒకటే రకం అభిరుచులు వున్న వాళ్లు ముఠాలుగా చేరి ఎంతమంది మనకు కనిపించటం లేదూ? వ్యక్తి ప్రాతినిధ్యం అంటే యిలాటిదే గవును!

సత్యనారాయణ చెప్పొచ్చే వేదాంతంలో నాకాట్టే నమ్మకం లేకపోయినా ఆయనలోమాత్రం వున్నదని ఒప్పుకుంటాను. అలాగని ఆయనేం చేసినా నేను తలూపి రైటంటా ననటానికి లేదు. ఏమంటే – మేమిద్దరమూ కూడా యిలాంటి విషయాల్లో చాలాసార్లు భేదాభిప్రాయాలు ప్రకటించుకున్నాము.

ఏవేవో విషయాలమాట అట్లావుంచి, ఆయన కుక్కపిల్లను పెంచటంలో కూడా భేదాభిప్రాయాలు ప్రకటించుకోవటమే నాకు మరీ చోద్యంగా అనిపిస్తోంది.

"నన్నడిగితే కుక్కను పెంచటంకన్న మరో దరిద్రం లేదు – దాని మొహం చూట్టానికే దౌర్భాగ్యంగా వుండేమాటఅట్లావుంచి అది చేసే అసహ్యకరమైన పనులూ, ఛండాలమూ మనుషులకు భరించశక్యంగాదు" అన్నాను.

"కుక్క వుండటంవల్ల అనేక ప్రయోజనాలున్నాయి –" అన్నాడాయన యికనైనా నేను కుతూహలంగా వినగలనన్న వూహతో, నానిర్లక్ష్యానికి యేమీ కించవహించకుండానే. కార్యశూరులు ప్రతిభావంతులుమరి! "ఒకటి!" అంటూ ప్రారంభించాడు. "ఏరాత్రి యేదొంగ కొంపలో దూరినా కాస్త ఇంటిముందు కుక్కవుండటం –" అన్నాడు.

"ఇన్నాళ్ళూ మీ యింట్లో ఎందరుదొంగలు పడ్డారూ?" అన్నాను.

నా ప్రశ్నకాయన సూటిగా సమాధానం చెప్పలేకపోయినాడు. కాస్త తటపటాయించి, "అదేం ప్రశ్న? అట్లా ఆలోచిస్తే, మనం యీ సంసారాలు చెయ్యనే అక్కరలేదూ!" అన్నాడు.

"రెండూ–కాస్త కాలక్షేపానికి అనువుగా ఉంటుంది. తీరిగ్గా వున్నప్పుడు బొత్తిగా గోళ్లుగిల్లుకుంటూ కూచోనవసరం లేకండా----"

"సరి! తీరిగ్గా వున్నప్పుడు కుక్కతోనే వినోదించాలీ? కాస్త చదరంగం పరచినా నెలలు సంవత్సరాలూ గడిచే పోతాయే!" అన్నాను.

"దానిమీదా విసుగెత్తినప్పుడూ?" అన్నాడు.

నేనేమీ సమాధానం చెప్పకండా ఆయనేం చెప్పినా వినటానికి సిద్ధంగా కూచున్నాను.

సత్యనారాయణ చెప్పుకుపోయినాడు. సవాలక్ష గ్రంథం అవుతుంది. అన్నీ అయాక "పోతే నష్టాలు యేమున్నాయో మీరు చెప్పండీ!" అన్నాడు.

"మంచి మీవొంతూ చెడు నావొంతునా?" అంటోనే మొదలెట్టాను---- "వెధవది దాని అరుపు వినటమే నాబోటివాడికి కంటక ప్రాయంగా వుంటుంది. పోతే మలమూత్ర విసర్జనాదులకు దానికి పాకీదొడ్డి ఎటూ పనికిరాదు. మనం కులాసాగా కూచునేచోట, నట్టింటోనూ అదాపని చేస్తుంది. దాన్ని అభ్యంతరం చెప్పటానికి లేదు. దాన్ని మన పిల్లలు తొక్కి యిల్లంతా వ్యాప్తం చేస్తారు ఇంకా..."

నాకడ్డంవొచ్చేసి "అలాటి చిక్కేం రాకండానే అది మలవిసర్జన చేసినప్పుడు వెంటనే దాసీదివొచ్చి ఎత్తేస్తుంది" అన్నాడు.

"ఈలోపల? దాసీది లేనప్పుడూ? ఇంకా అనేక చిక్కులున్నాయి. దానికి రోజూ అన్నం కలిపిపెట్టాలి. ఎవరు పెట్టేట్టు? దానికి బోలెడు గజ్జి మొదలైన అంటురోగాలు అంటుకుంటాయి అవి మన పిల్లలకుగూడా తగిలితే ప్రమాదం కాదా?"

"నువ్వెన్ని కారణాలు వెదికి వెదికి చెప్పినా అన్నింటికీ పరిహారాలు చెప్పగలను."

"అ! తరవాత ఇది బజారులో తిరిగి కొంప మీదికి బోలెడన్ని తగాదాలు తెస్తుంది. ఎవడి కుక్కనో వెంటబడి వేధిస్తుంది. ఏదో కథలోలాగ ఎవడి వేలో కసిక్కిన కొరుకుతుంది. ఎవడు దాచుకున్న కూడో కాజేస్తుంది!"

"అట్లా చెయ్యటానికి మనం దీన్ని గడప దాటి అవతలికిపోనిస్తే గదా? అదీ మనతోపాటే ఇంటిదగ్గ రేవుంటుంది" "దానికీ ఓ గది ప్రత్యేకంగా వుంచి పెంచితే యిక అది యిల్లు కాపలా కాయటం యెవడు చేస్తాడు? మీరు కొనటంలో ముఖ్యోద్దేశ్యం అదేకదా!-----"

ఇట్లా నేను బోలెడన్ని సంగతులు విడమర్చి చెప్పాను. ఎవడు ఆలోచించినా తెలుసుకోలేని పరమసత్యాలు చెప్పిచూశాను. సత్యనారాయణగారు యే వొక్క కారణానికైనా లొంగక పోతాడా అని చూచాను.

ఇంతగా నేనెందుకు చెప్పవలసి వచ్చిందంటే, విషయం యెట్లాంటిదయినా మన అభిప్రాయాలు మనం జంకుబొంకు లేకుండా బయట పెట్టాల్సిందే అన్న పూనికే!

చిట్ట చివరికి సత్యనారాయణగారు కుక్కపిల్లని కొనటానికే నిర్ణయించారు. నేను "చెప్పవలసింది చెప్పేశాను. నా అభిప్రాయం తెలీపర్చాననన్నమాటేగాని మిమ్మల్నిట్లా చెయ్యమని బలవంతం చేస్తున్నాననుకోకండి! ఎవరికైనా అనుభవంమీదగాని కొన్ని సంగతులు తెలిసిరావు," అన్నాను.

"అదెంతమాట?" అన్నాడాయన. నేను మాట్లాడకుండా వూరుకున్నాను.

తరువాత నాలుగు రోజులకి నేను ఆయన యింటికి వెళ్ళటం తటస్తించింది. ఆయనెందుకో ముఖం ముడుచుకునుండటం గమనించాను.

"మొన్న మనం చర్చించాం చూశారా" అంటూ మొదలెట్టాడు.

నాకో పట్టాన విషయం గుర్తుకు వచ్చింది కాదు. "కుక్క సంగతి! కొన్నా. చనువు కొద్దీ గొలుసు వెయ్యకుండా వుంచితే ----" అని ఆగారు.

నేనే కలగచేసుకుని "ఏమయిందీ?" అని అడగాల్సి వచ్చింది.

"ఏమయినదంటారా?"---- అంటూ ఆయన మొదలెట్టాడు, "యీ విషయంలో తనకేమీ స్వకుతూహలము లేనట్టూ, కేవలం నేనడగబట్టే చెబుతున్నట్టూ ----
"అది పారి పోయింది!"

విషయం ఆగిఆగి చెప్పటంలో ఆయనకున్న ఆనందం మధ్యలో చెడగొట్టటం అమానుషమని వూరుకున్నాను.

"వెదికించాను! రెండు రోజులు వెదికినమీదట అది ఒక యింట్లో దొరికింది. ఆ కుక్కపిల్లే యిదీ అనటానికి సందేహం యేమీ లేదు. పైగా ఆయింటి ఆసామి కూడా అన్నాడు, 'యిది నాకెక్కడో దొరికింది. రోజల్లా చూచాను ఎవరన్నా వస్తారేమోనని! చివరకి యింట్లో పాత గొలుసుంటే ఒకటి తీసి కట్టాను! ---- తీసుకు వెళ్ళండి' అని.

తెచ్చి యింట్లో కట్టించాము. "తిరిగి ఆరాత్రే అది తప్పించుకు పోయింది!" అన్నాడు.--

"ఇంతేనా జరిగినకథ" అన్నాను.

"చాలదా యేమిటి? ఇంతకూ నన్ను బాధించే అనుమానమేమిటంటే చక్కటి గొలుసుతో కట్టేశాం కదా, ఎక్కడికి తప్పించుకు పోయిందా అని!"

"గొలుసుతో సహా పోలేదు కదా?"

"లేదు"

"మొదట్లో కుక్క దొరికిన ఆసామి దగ్గర గొలుసొకటుందన్నారుకదూ?"

"ఆ"

"అయితే కుక్క అక్కడ మళ్ళీ దొరకలేదన్నమాట!"

"లేదు----"

"కుక్క ఖరీదెంత?"

"అంటే?"

"ఎంత యిచ్చి కొన్నారూ? అని"

"ఎనిమిది!"

"ఎనిమిది?" అన్నాను మళ్ళీ.

తరవాత ఈ ప్రసక్తి నాదగ్గర ఆయనగాని, ఆయన దగ్గర నేనుగానీ తేవటం పడలేదు. ❁

(తెలుగు స్వతంత్ర)